ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 31 జనవరి 2025

మీ కోసం కార్యక్రమం నిలుపుదల: కలెక్టర్

పార్వతీపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ఇది ముగిసినంత వరకూ మీకోసం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం నిలుపుదల చేయనున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఫిబ్రవరి 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. మార్చి 8న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. అంత వరకు ప్రజలు వినతులు అందించేందుకు రావద్దని విజ్ఞప్తి చేశారు.

ఇలానే వదిలేస్తారా?

- ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరుపయోగంగా వాహనాలు
- ఎక్సైజ్, పోలీస్‌స్టేషన్లలోనూ ఇదే పరిస్థితి
- వివిధ కేసుల్లో సీజ్ అయిన వాహనాలకు తుప్పు


పంచాయతీరాజ్ కార్యాలయంలో మూలకు చేరిన రోడ్డు రోలర్

పాలకొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పాలకొండలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో లక్షలాది రూపాయల విలువ చేసే వాహనాలు నిరుపయోగంగా దర్శనమిస్తోన్నాయి. చిన్న చిన్న మరమ్మతులకు గురైనా అవి కొన్నాళ్లుగా వినియోగానికి నోచుకోవడం లేదు. దీంతో అవి మూలకు చేరి తుప్పుపట్టి పోతున్నాయి. దశాబ్దాలు గడుస్తున్నా.. పరిస్థితి మారకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద రోడ్డు రోలర్ 15 ఏళ్ల కిందట చిన్నపాటి మరమ్మతులకు గురై మూలకు చేరింది. అదే కార్యాలయం బయట ఉన్న జీపు తుప్పుపట్టి ఉంది. దాని ప్రధాన విడి భాగాలు దొంగలపాలయ్యాయి. ఆర్అండ్‌బీ బంగ్లా సమీపంలో చిన్నపాటి వాహనాలు, తారు కలిపే యంత్రాలు పూర్తిగా పాడై మట్టిలో కలిశాయి. ఇదిలా ఉండగా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సారా తయారీ, రవాణా విక్రయదారుల నుంచి సీజ్ చేసిన ఆటోలు, బైక్‌లను సకాలంలో వేలం వేయడం లేదు. దీంతో ఏళ్లతరబడి అవి ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పూర్తిగా పాడవుతున్నాయి. పాలకొండ, సీతంపేట, వీరఘట్టం, భామిని, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మ లక్ష్మీపురం తదితర పోలీస్ స్టేషన్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వివి ధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు ఎందుకూ పనికిరా కుండా పోతున్నాయి. అందుబాటులో ఉన్న ప్రభుత్వ వాహనా లకు మరమ్మతులు చేయక పోవడంతో అవి మట్టిలో కలుస్తు న్నాయి. దీనిపై పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళిని వివరణ కోరగా.. 'ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తాం. తద్వారా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమచేస్తాం.' అని తెలిపారు.


పంచాయతీ కార్యాలయం బయట రూపు కోల్పోయిన జీపు


పాలకొండ పోలీస్‌స్టేషన్ వద్ద తుప్పుపట్టిన వాహనాలు

గిరిజనుల కష్టాలకు చెక్

- కొండవాగు గెడ్డపై రెండు వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.2కోట్లు మంజూరు
- మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం


వంతెన నిర్మించనున్న సరాయివలస కొండవాగు గెడ్డ ఇదే

పాచిపెంట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు వంతెన కష్టాలు తీరనున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మండలంలోని సరాయివలస సమీపంలో కొండవాగు గెడ్డపై రెండు వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి నిధులు మంజూరు చేయడంతో పాటు శంకుస్థాపన కూడా చేసింది. దీంతో తమ దశాబ్దాల కల త్వరలో నెరవేరనుందని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొండవాగు గెడ్డపై వంతెనలు లేకపోవడంతో మండలంలోని 15 గ్రామాలకు చెందిన గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల సమయంలో గెడ్డలో నీటి ఉధృతి పెరగడంతో చొక్కాపువానివలస, శివలింగపురం, సరాయివలస, తదితర గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంటుంది. కొన్నిసార్లు నీటి ఉధృతి కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. గతేడాది ఏకలవ్య పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు మహేష్, బర్తి విధులకు వెళ్లేందుకు కొండవాగు గెడ్డ దాటుతుండగా వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందారు. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే కొండవాగు గెడ్డపై రెండు వంతెనలు నిర్మిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అనుకున్నట్లే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్ఆర్ఈజీఎస్ కింద రెండు వంతెనలతో పాటు 1.2 కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసింది. చొక్కాపువానివలస నుంచి సరాయివలస మార్గమధ్యలో ఒక వంతెన, సరాయివలస సమీపంలో మరొక వంతెన నిర్మించనున్నారు. ఈ పనులకు ఈ నెల 24న రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శంకుస్థాపన చేశారు. దీంతో గిరిజన, గిరిజనేతరుల ఆనందానికి అవధులు లేవు. వంతెనల (మిగతా 8వ పేజీలో..)


ఈనెల 24న పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

ఎట్టకేలకు..

- పూర్తయిన కురుపాం ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణం
- ఆరేళ్ల పాటు సాగిన పనులు
- రేపు ప్రిన్సిపాల్‌కు అప్పగించనున్న అధికారులు
- త్వరలో తరగతులు ప్రారంభం



పాఠశాల భవనం సిద్ధమైన దృశ్యం, పైన అదనపు తరగతుల నిర్మాణానికి పిల్లర్లు వేసిన దృశ్యం

కురుపాం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కురుపాం ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల భవనం సిద్ధమైంది. ఆరేళ్ల పాటు ఆగుతూ.. సాగుతూ జరిగిన పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఈ భవనాన్ని శనివారం పాఠశాల ప్రిన్సిపాల్‌కు అధికారులు అప్పగించనున్నారు. త్వరలో ఈ భవనంలోనే విద్యార్థులకు తరగతులు కూడా ప్రారంభంకానున్నాయి. 2012లో కేంద్ర గిరిజనశాఖ మంత్రిగా ఉన్న వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ రాష్ట్రానికి 11 ఏకలవ్య పాఠశాలలను మంజూరు చేయించారు. మైదాన ప్రాంతాల్లో నిర్మాణానికి రూ.12 కోట్లు, గిరిశిఖర ప్రాంతాల్లో నిర్మాణానికి రూ.14 కోట్లు కేటాయించారు. ఇందులో భాగంగా కురుపాం మండలానికి ఒక ఏకలవ్య పాఠశాల మంజూరైంది. దీనికోసం కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాల పక్కన ఉన్న స్థలాన్ని కేటాయించారు. అయితే, ఇక్కడ ఏడేళ్ల వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. కురుపాంలో వసతులు లేకపోవడంతో 2016-17 విద్యా సంవత్సరంలో ఏకలవ్య విద్యార్థులకు పార్వతీపురం మండలం ఎస్.బెలగాం పాఠశాలలో తరగతులు ప్రారంభించారు. కురుపాంలో భవన నిర్మాణ కోసం 2017లో టీడీపీ ప్రభుత్వం టెండర్లు పిలవగా సత్యసాయి కనస్ట్రక్షన్స్ ఒక్కటే దాఖలు చేసింది. ఆ సంస్థతో గిరిజన ఇంజనీరింగ్ అధికారులు ఒప్పందం చేసుకున్న తర్వాత కొందరు కోర్టుకు వెళ్లారు. సత్యసాయి కనస్ట్రక్షన్స్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో 2019లో అప్పటి గిరిజన సంక్షేమశాఖ మంత్రి (మిగతా 8వ పేజీలో..)


డైనింగ్ హాల్

వదలని ఏనుగులు

- సీతంపేటలో కర్బూజ పంట నాశనం
- లబోదిబోమంటున్న రైతులు
- కాపాడాలంటూ ఫారెస్టు రేంజర్‌కు విన్నపం

కురుపాం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాను ఏనుగులు వదలడం లేదు. ఏదో ఒక గ్రామంలో అలజడి సృష్టిస్తూనే ఉన్నాయి. బుధవారం రాత్రి కురుపాం పంచాయతీ సీతంపేటలో మూడు ఎకరాల కర్బూజ పంటను నాశనం చేశాయి. 15 రోజుల్లో చేతికందాల్సిన పంటను ఏనుగులు తినేశాయంటూ రైతు గుండ్రెడ్డి రామకృష్ణ లబోదిబోమంటున్నాడు. మంగళవారం రాత్రి పాలేం గ్రామంలో పామాయిల్ మొక్కలను నాశనం చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా కొమరాడ, కురుపాం మండలాల రైతాంగాన్ని గజరాజులు వణికిస్తున్నాయి. గురువారం కిచ్చాడ, పులిగుమ్మి ప్రాంతాల్లో తిష్టవేశాయి. దీనిపై ఇప్పటికే రైతులు స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరిని కలిసి ఏనుగుల నుంచి కాపాడాలని, పంటలకు నష్ట పరిహారం ఇప్పించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. గురువా రం కురుపాం ఫారెస్టు రేంజి అధికారి గంగరాజులును కలిసి ఏనుగుల నుంచి తమను రక్షణ కల్పించాలని కోరారు. వాటిని ఇక్కడ నుంచి తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏనుగుల కోసం పార్వతీపురం సమీపంలోని గుచ్చిమి వద్ద 200 ఎకరాల్లో ఎలిఫేంట్ కారిడార్ ఏర్పాటు చేస్తామన్నారు. కర్ణాటక నుంచి కుంకి ఏనుగును తెప్పించి ఈ ఏనుగులను మచ్చిక చేసుకోవడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. కూటమి ప్రభుత్వ వచ్చిన నుంచి నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు.



పులిగుమ్మి వద్ద ఉన్న ఏనుగులు, సీతంపేటలో కర్బూజ పంటను నాశనం చేసిన దృశ్యం

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- పాడి రైతులకు న్యాయం చేసిన ప్రభుత్వం
- పశు నష్ట పరిహారం ఖాతాల్లో జమ

6లో

జన సంద్రంగా మరియగిరి



6లో

పామాయిల్ తోటలతో అధిక లాభాలు

- ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పామాయిల్ తోటల పెంపకంతో గిరిజన రైతులకు అధికలాభాలు వస్తాయని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. చినబగ్గ గ్రామంలోని పామాయిల్ ప్లాంటేషన్‌ను ఆయన గురువారం పరిశీలించారు. శతశాతం సబ్సిడీతో పామాయిల్ మొక్కలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. చిన్నారులకు ఆట, పాటలతో కూడిన విద్యను అందించాలని టీచర్‌కు సూచించారు. అనంతరం మర్రిపాడు పీహెచ్‌సీ, ఏఎన్ఎం సబ్‌సెంటర్, పూతికవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించారు. పీహెచ్‌సీలో అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు మెరుగైన విద్యను అందించాలని, ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హెచ్ఎం శారదను ఆదేశించారు. పాఠశాలలో నెలకొన్న భవనాల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. దీనికి ముందు పాత పనుకువలసలో ఎంఎస్ఎంఈ పార్క్ కోసం గుర్తించిన స్థలాన్ని పీవో పరిశీలించారు. ఆయన వెంట పీహెచ్‌వో వెంకటగణేష్, హెచ్‌వోలు ఉన్నారు.


ఆశ్రమ పాఠశాలలో వంటకాలను రుచిచూస్తున్న ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయండి

సీతంపేట ఐటీడీఏ ద్వారా అందించే పథకాల కోసం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీసీడీపీ, ఎస్‌సీఏ టు టీఎస్‌పీ కింద మంజూరైన పథ కాలకు పూర్తిగా అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. గతంలో వీరు ఎటువంటి జీవనోపాధి పథకాలు పొంది ఉండకూడదన్నారు. పీజీఆర్ఎస్‌కు వినతులు అందించిన వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ సమీక్షలో ఏపీవో జి.చిన్నబాబు, వెలుగు ఏపీడీ సన్యాసిరావు పాల్గొన్నారు.

కేంద్రం వరమిస్తుందని..



- కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల ఆశలు
- కీలక ప్రాజెక్టులకు మోక్షం కల్పించాలని విన్నపం
- గిరిజన యూనివర్సిటీకి సాయమందించాలని వేడుకోలు

విజయనగరం/బొబ్బిలి/శృంగవరపుకోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి):

కేంద్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులతో పాటు సమస్యల పరిష్కారానికి కేంద్రం ఒక మార్గం చూపాలని కోరుతున్నారు. ముఖ్యంగా రాష్ట్ర విభజన హామీల్లో ఒకటైన గిరిజన యూనివర్సిటీకి సంబంధించి పూర్తి స్థాయిలో నిధుల విషయంలో స్పష్టత రావలసి ఉంది. రైల్వే ప్రాజెక్టులు సైతం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో పాటు యూనివర్సిటీకి ఊతమివ్వాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

● రైల్వే లైన్ కదిలేనా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో మరో రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. విజయనగరం నుంచి రాజాం మీదుగా పలాస వరకు రైల్వేలైన్ నిర్మాణ సర్వేకు సంబంధించి డీపీఆర్‌ను ఆమోదించింది. విజయనగరం నుంచి రాజాం, పాలకొండ, కొత్తూరు, పర్లాకిమిడి, మెళియాపుట్టి మీదుగా పలాసకు 142 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ పనుల మంజూరుకు మాత్రం ఇంతవరకూ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. ఈ రైల్వేలైన్‌తో ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలతో పాటు ఒడిశాలోని కొన్ని ప్రాంతాలకు ప్రయోజనం చేకూరనుంది. ప్రజా రవాణాతో పాటు పారిశ్రామికాభివృద్ధి, గిరిజన ఉత్పత్తుల రవాణా, మార్కెటింగ్‌కు మరింత అనుకూలత ఏర్పడనుంది. పర్యాటకంగానూ మరింత అభివృద్ధికి అవకాశం కలుగనుంది. గిరిజనాభివృద్ధికి కొత్త రైల్వే లైన్ ఎంతగానో దోహదపడనుంది. తాజా బడ్జెట్‌లో కొత్త రైల్వేలైన్‌కు సంబంధించి ప్రభుత్వం శుభవార్త చెబుతుందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా.. జాతీయ రహదారి 26 మీదుగా మానాపురం, విజయనగరం దగ్గర నిర్మిస్తున్న రైల్వే వంతెనలు త్వరితగతిన పూర్తయితే విజయనగరం నుంచి పార్వతీపురం వెళ్లే ప్రయాణికులకు ఎంతో మేలు కలుగుతుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

పరిశ్రమలతో పాటు ఇతర ప్రాజెక్టులు..

జిల్లాలోని అనేక పరిశ్రమలు ప్రభుత్వాల ప్రోత్సాహం లేక మూతపడ్డాయి. ముఖ్యంగా ఫెర్రో అల్లాయీస్ పరిశ్రమలు ఒక్కొక్కటీ మూతపడుతూ వస్తున్నాయి. చక్కెర కర్మాగాలదీ అదే పరిస్థితి. జిల్లాలో జ్యూట్ మిల్లులకు పెట్టింది పేరు. అటువంటిది కేంద్ర ప్రభుత్వపరంగా జ్యూట్‌కు ప్రోత్సాహం కరువవుతోంది. మరోవైపు జిల్లా మీదుగా గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం కూడా నత్తనడకన కొనసాగుతోంది. అటు రెండు జాతీయ రహదారులు ఉన్నాయి. వాటి విస్తరణ, ఇతరత్రా నిర్మాణాల కు ప్రభుత్వం కేటాయింపులు చేస్తుందని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రతిపాదనలు..



రామతీర్థాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించాం. జాతీయ రహదారి, విజయనగరం నుంచి పాలకొండ- సీతంపేట- హడ్డుబంగి వరకూ రోడ్డు నిర్మాణానికి డీపీఆర్ ఇవ్వాలని కోరాం. రాజాంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని గతంలోనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. చిలకపాలెం నుంచి రాజాం, రాజాం- బొబ్బిలి- పార్వతీపురం- రాయగడ వరకూ రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు ఇచ్చాం. దీని కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరాం.

-కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ

కేంద్రం కరుణ చూపాలి..

జిల్లాపై కేంద్ర ప్రభుత్వం కరుణ చూపాలి. గిరిజన యూనివర్సిటీకి నిధుల కేటాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలి. వీలైనంత త్వరగా గిరిజన యూనివర్సిటీ భవన నిర్మాణాలు పూర్తి చేసి.. చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

-సాయిరాం, విద్యావేత్త విజయనగరం

పరిశ్రమలను తెరిపించాలి

జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేయాలి. మూతపడిన పరిశ్రమలను తెరిపించాలి. ముఖ్యంగా ఫెర్రో అల్లాయీస్ పరిశ్రమలపై దృష్టి పెట్టాలి. వాటిపై ఆధారపడిన వేలాది మంది కార్మికుల ఉపాధిని దృష్టిలో పెట్టుకొని తెరిపించే ప్రయత్నం చేయాలి. అందుకు పరిశ్రమలకు కొన్నిరకాల వెసులబాటులు, రాయితీలు ఇవ్వాలి. చక్కెర కర్మాగారాలనూ అందుబాటులోకి తేవాలి.

-అశోక్, కార్మికుడు, విజయనగరం

గిరిజన గ్రామాలన్నిటినీ షెడ్యూల్‌లో గుర్తించాలి..

ప్రస్తుతం నాన్ షెడ్యూల్‌లో ఉన్న గిరిజన గ్రామాలన్నిటినీ షెడ్యూల్‌లో గుర్తించాలి. షెడ్యూల్‌లో లేని గ్రామాలకు 1/70 యాక్టు వర్తించక పోవడంతో వారి భూములను గిరిజనేతరులు దక్కించుకుంటున్నారు. గిరిజన ప్రజలు వారి వద్ద బానిసలుగా బతకాల్సి వస్తోంది. జిల్లాలో సుమారు 175 గిరిజన గ్రామాల వరకు షెడ్యూల్‌లో కలపాలని చాలా కాలంగా గిరిజన సంఘం డిమాండ్ చేస్తోంది. షెడ్యూల్‌లో కలిస్తేనే విద్య, ఉద్యోగాలతో పాటు అన్నివిధాలుగా గిరిజనులకు ప్రయోజనం కలుగుతుంది. కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో దీనిపైన చర్చ జరగాలి. ప్రత్యేక నిధులు కేటాయించాలి.

-జె.గౌరీష్, గిరిజన సంఘ నాయకుడు, శృంగవరపుకోట

ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యమివ్వాలి..



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం చాలా అవసరం. విభజన చట్టంలో అనేక హామీలను పొందుపరిచారు. గడువు దాటుతున్నా అవి పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు, రైల్వే జోన్ ఏర్పాటు వంటి పనులు చకచకా జరగాలి. వీటికి నిధులు కేటాయించాలి. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ హామీలు నెరవేరాలి. మధ్య తరగతి, ఉద్యోగులకు, ఆదాయ పన్ను రాయితీని పెంచాలి. రాష్ట్రానికి ఉన్న భారీ రెవిన్యూ లోటును కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాలి. పేద, బడుగు వర్గాల జీవన ప్రమాణాలు పెంచేలా చూడాలి.

-కొలు చిరంజీవులు, లెక్చరర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బొబ్బిలి

పన్ను పరిమితి రూ.10లక్షలకు పెంచాలి..



పన్నుల విధింపు, లెక్కింపు, విశ్లేషణలో పన్ను చెల్లింపుదారులంతా గందరగోళానికి గురవుతున్నారు. దీనికి తెరదించాలి. ఆర్థిక సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకోవాలి. కొత్త పన్నుల విధానంలో మినహాయింపులకు చెల్లు చీటీ ఇచ్చారు. విద్య, వైద్యం వంటి వాటి కోసమైనా మినహాయింపులను కొనసాగించాలి. పొదుపు మంత్రానికి ఊతమిచ్చే విధానం ఉండాలి. నిరుత్సాహ పరిచే పద్ధతులను రద్దు చేయాలి. స్థిరాస్తి లెక్కింపులో ఉన్న లోపాలను సవరించాలి. వ్యవసాయం, వ్యాపారం రెండు వృత్తుల్లో ఉన్న వారికి రెండింటి మీద పన్ను విధిస్తున్నారు. వ్యవసాయ రంగానికి మినహాయింపు ఇవ్వాలి. వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలి. సూపర్ సీనియర్ సిటిజన్ వయోపరిమితిని 80 నుంచి 70 ఏళ్లకు తగ్గించాలి. ఉద్యోగుల స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని రూ.75 వేల నుంచి రూ.1.25 లక్షలకు పెంచాలి.

-జేసీహెచ్ నారాయణమూర్తి, చార్టెడ్ అకౌంటెంట్, బొబ్బిలి

ఆదాయ పన్నులో సరళీకృత విధానాలు అవలంబించాలి..



కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్ను విభాగంలో సరళీకృత విధానాలు అవలంబించాలి. ప్రపంచంలోని దేశాలన్నిటి కంటే భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం పటిష్ఠంగా ఉంది. ఇది మరింత పటిష్ఠం కావాలంటే కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలి. నిరుపేద, పేద, మధ్య తరగతి, వ్యవసాయానికి కేటాయింపులు చేయాలి. వారిని లక్ష్యంగా చేసుకుని కార్యక్రమాలను ప్రకటించాలి. బడ్జెట్ అన్ని వర్గాలకు న్యాయం చేసేదిగా ఉండాలి.

-ఈఆర్ సోమయాజులు, ఆడిటర్, విజయనగరం

కోటి పాట్లు విద్య కొరకే...

- నిత్యం బస్సుల కోసం ఇక్కట్లు
- ఫుట్‌బోర్డులపై ప్రమాదకర ప్రయాణం
- ఇదీ జామి మండల విద్యార్థుల దుస్థితి



జామి మండల కేంద్రం నుంచి ఎస్.కోటలోని కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు రోజూ సాగించే సాహస ప్రయాణమిది. ఒక్క మాటలో చెప్పాలంటే చదువు కోసం ప్రాణాలను పణంగా పెడుతున్నారు. దారి పొడవునా ఈ దృశ్యాన్ని చూసి.. సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తుంటే... విద్యార్థులకు ఈ కష్టాలు తప్పించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రం చలించడం లేదు.

జామి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి)

'కోటి విద్యలు కూటి కొరకే' అన్న నానుడిని 'కోటి పాట్లు విద్య కొరకే.' అన్నట్టుగా మార్చుకునేలా ఉన్నాయి ఈ విద్యార్థుల కష్టాలు. జామి మండల కేంద్రం నుంచి నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు విజయనగరం, ఎస్.కోట తదితర ప్రాంతాలకు చదువుకునేందుకు పాఠశాలలు, కళాశాలలకు వెళుతుంటారు. ఈ మార్గంలో నడుస్తున్నవి కేవలం నాలుగు సర్వీసులేనని స్థానికులు చెబుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి విద్యార్థులు పడిగాపులు కాస్తే.. ఎప్పటికో ఒక బస్సు వస్తుంది. అప్పటికే అది ప్రయాణికులతో నిండిపోయి ఉంటుంది. ఆపైన విద్యార్థులకూ అదే దిక్కు. ఇక విధిలేని పరిస్థితిలో ఇలా కిక్కిరిసిన బస్సులో ఫుట్‌బోర్డుపైన, కిటికీలకు వేలాడుతూ ప్రయాణించాల్సి వస్తోంది. ఎస్.కోట డిపో పరిధిలో ఒకప్పుడు 70 బస్సులు ఉంటే.. వైసీపీ ప్రభుత్వం ఉదాసీనత పుణ్యమా అని ఆ సంఖ్య 50కి పడిపోయింది. ఇక సిబ్బంది కొరత ఎలాగూ వేధిస్తోంది. ఈ సమస్యల నడుమ బస్సులు సరిగా లేకపోవడంతో ఆ ప్రభావం విద్యార్థులపై పడుతోంది. కూటమి ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి.. ఈ ప్రాంతంలో విద్యార్థులకు అనువైన వేళల్లో బస్సు సర్వీసుల సంఖ్య పెంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

దివ్యాంగుల లెక్క తేలుతోంది!

- పింఛను లబ్ధిదారుల వైకల్య శాతం పరిశీలన
- జిల్లాలో అన్ని ఆస్పత్రుల్లో కొనసాగుతున్న ప్రక్రియ
- బోగస్ లబ్ధిదారుల్లో గుబులు



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

రాజాం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో దివ్యాంగ పింఛను లబ్ధిదారులకు మళ్లీ వైకల్య నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను మొత్తాన్ని పెంచిన సంగతి తెలిసిందే. దివ్యాంగులకు రూ.6 వేలు.. కండరాల బలహీనత, పక్షవాతం తదితర రుగ్మతలతో బాధ పడుతున్నవారికి రూ.10 వేలు, దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టిన వారికి రూ.15 వేలను ప్రభుత్వం అందిస్తోంది. జిల్లాలో మంచానికే పరిమితమైన వారు 342 మంది ఉన్నారు. వీరి ఇళ్లకు వెళ్లి వైద్య బృందం ఇప్పటికే తనిఖీలు పూర్తి చేసింది. ఇందుకుగాను ఇతర జిల్లాలకు చెందిన వైద్యుల బృందాన్ని నియమించింది. తొలుత వీరి పరిశీలన పూర్తిచేసింది. ఒక ఆర్థోపెడిక్ వైద్యుడు, జనరల్ ఫిజీషియన్‌తో పాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారితో కూడిన బృందం వెళ్లి పరిశీలించింది. ఈ నెల మొదటి వారం నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ పూర్తయ్యింది. ఇప్పుడు మిగతా దివ్యాంగులకు సంబంధించి ప్రభుత్వాస్పత్రుల్లో పరీక్షలు జరుగుతున్నాయి.

● కొనసాగుతున్న ప్రక్రియ..

జిల్లాలో రూ.6 వేల పింఛన్ మొత్తాన్ని అందుకుంటున్న లబ్ధిదారుల సంఖ్య 36,974. ప్రస్తుతం వీరికి నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. రోజుకు 50 మందికి పరీక్షిస్తున్నారు. ప్రతి లబ్ధిదారుడికి టోకెన్ అందిస్తున్నారు. ఆ సమయానికి లబ్ధిదారుడు వెళ్లి పరీక్షించుకోవాలి. ఒక వేళ ఎవరైనా ఈ పరీక్షకు హాజరుకాకపోతే తరువాత నెల పింఛన్‌ను హోల్డ్‌లో పెడతారు. వైకల్య శాతం నిర్ధారించుకొని... అర్హత సాధిస్తేనే పింఛను కొనసాగిస్తారు. లేకుంటే మాత్రం తొలగిస్తారు. ఇది బోగస్ పింఛన్లు పొందుతున్న వారిలో గుబులు రేపుతోంది.

● తప్పుడు ధ్రువపత్రాలతో...

జిల్లాలో అనేక మంది తప్పుడు సదరం ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్నట్టు తెలుస్తోంది. కొంతమంది అనుమానంతో పరీక్షలకు హాజరుకావడం లేదు. పరీక్షలకు వస్తున్న వారిలో 30 శాతం వరకూ అనర్హులు ఉన్నట్టు తేలుతోంది. ఆ విషయాన్ని వైద్యులు బయటకు చెప్పడం లేదు. అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రభుత్వం ప్రత్యేక జాబితాను వెల్లడించే అవకాశముంది. వైకల్య నిర్ధారణకు సంబంధించి సచివాలయాల వారీగా జాబితాలు ప్రదర్శిస్తారని తెలుస్తోంది. వైసీపీ హయాంలో చోటా నేతలే సదరం సర్టిఫికెట్ల విషయంలో సూత్రధారులుగా తెలుస్తోంది. కొందరు వైద్యాధికారులతో కుమ్మక్కై లబ్ధిదారుల వద్ద వేలాది రూపాయలు వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. అటువంటి వారి గుట్టు తాజా వైద్య పరీక్షల్లో బయటపడుతోంది.

● ప్రభుత్వ మార్గదర్శకాలతో..

దివ్యాంగ పింఛన్ల తనిఖీని పక్కాగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం రోజుకు 40 మందికి వైద్య పరీక్షలు చేస్తున్నాం. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తున్నాం. ఇలా నిర్ధారణ పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం. ప్రభుత్వం ఈ జాబితాలను తరువాత ప్రదర్శిస్తుంది.

-సనపల తిరుపతిరావు, వైద్యాధికారి

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- పాడి రైతులకు న్యాయం చేసిన కూటమి ప్రభుత్వం
- పశు నష్ట పరిహారం జమ
- జిల్లాలో 950 మంది రైతులకు లబ్ధి

జియ్యమ్మవలస, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాడి రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. పశు నష్ట పరిహారం అందించింది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పాడి రైతులకు గతంలో తీవ్ర అన్యాయం జరిగింది. ఎంతో కాలంగా పాడి సంపదపై బతుకుతున్న రైతులు తాము పెంచిన పశు సంపద అకాల మృత్యువాత పడటం వల్ల తీవ్రంగా నష్టపోయారు. వీరికి సకాలంలో పరిహారం అందించి... ఆదుకోవలసిన గత ప్రభుత్వం మొండి చేయి చూపింది. తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పాడి రైతులకు నష్ట పరిహారం ఇచ్చి... న్యాయం చేసింది. జిల్లాలో 950 మంది రైతులకు నష్ట పరిహారాన్ని నేరుగా వారి బ్యాంకు అకౌంట్లకు జమ చేసింది. జిల్లాలో 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి పాడి రైతులకు నష్ట పరిహారం అందడం లేదు. మొత్తం 950 మంది పాడి రైతులకు చెందిన 1,120 పశువులు, మేకలు, గొర్రెలు చనిపోయాయి. ఈ నష్ట పరిహారం మొత్తం రూ. 2,48,64,500 చెల్లించాల్సి ఉంది. దీనిపై గతంలో నివేదికలు సమర్పించినా.. వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. తాజాగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ చొరవతో రైతుల అకౌంట్లలో సంబంధిత మొత్తం జమైంది. దీంతో ప్రభుత్వంతో పాటు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.మన్మథరావులకు పాడి రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



మేరీమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించిన దృశ్యం

జన సంద్రంగా మరియగిరి

- భక్తుల ప్రత్యేక ప్రార్థనలు

వీరఘట్టం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యు.వెంకమ్మపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన మేరీమాత యాత్ర గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కులమతాలకు అతీతంగా సుమారు 50 వేల మంది భక్తులు వచ్చి మేరీమాత విగ్రహాల వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. కొబ్బరి కాయలు కొట్టి, తలనీలాలు అర్పించడం మరియగిరి యాత్రలో ప్రత్యేకత. ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మరియగిరిపై చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ చంద్రమౌళి, ఎస్ఐ కళానిధితో పాటు 90 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పాలకొండ, పార్వతీపురం ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు.



యాత్రలో పాల్గొన్న భక్తులు

కోడ్ కూసింది.. ముసుగు పడింది

విజయనగరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కూసింది. మూడు ఉమ్మడి జిల్లా (విజయనగరం, విశాఖపట్టణం, శ్రీకాకుళం) ల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నెల 30 నుంచి మార్చి నెల 3వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ ఉంటుంది. ఈ మూడు జిల్లాల్లో ప్రస్తుతం అమలులో ఉన్నవి తప్ప, కొత్త పథకాల ప్రారంభానికి అవకాశం ఉండదు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా ఉన్న రాజకీయ పార్టీ నాయకుల విగ్రహాలకు తాత్కాలికంగా ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం తిరిగి ముసుగులను తొలగిస్తారు.



విజయనగరం జిల్లా కేంద్రంలోని వివిధ కూడళ్లలో గల విగ్రహాలకు ముసుగులు వేసిన దృశ్యం

సీఎం దృష్టికి నెల్లిమర్ల సమస్యలు



సీఎం చంద్రబాబు మాట్లాడుతున్న కర్రోతు

భోగాపురం, జనవరి30(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్టు ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. సచివాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశానన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు, రాజకీయ పరిస్థితులు, కార్యకర్తల సమస్యలను సీఎం తెలియజేసినట్టు గురువారం ఆయన తెలిపారు.

కుంభమేళాకు ఆర్టీసీ బస్సులు

విజయనగరం రింగురోడ్డు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ఫిబ్రవరి 2న విజయనగరం నుంచి ప్రయోగ్‌రాజ్‌కు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు నడుపనున్నట్టు ఏపీఎస్ ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్ర వరి 2న సాయంత్రం 6 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు వయా భువనేశ్వర్, కోణార్క్, పూరీ, ప్రయోగరాజ్, వార ణాసి మీదుగా అయోధ్యకు వెళ్లి తిరిగి 13వ తేదీ రాత్రి విజయనగరం చేరుకుంటుందన్నారు. మహా కుంభమేళా ప్రత్యేక బస్సు సర్వీసును ఆన్‌లైన్ ద్వారా ఆర్టీసీ కాంప్లెక్స్ రిజర్వేషన్ కౌంటర్ ద్వారా సౌకర్యం పొంద వచ్చునన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారంతో పాటుగా రాను పోను టిక్కెట్ ధర రూ 10,500 ధర మాత్రమేనన్నారు. భక్తు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. మరిన్ని వివరాలకు 99592 25620, 94943 31213 నెంబరును సంప్రదించాలని కోరారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన

దత్తిరాజేరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిలకు సంబంధించిన స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను గురువారం తహసీల్దార్ పి.విజయభాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌లో అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఓటర్లకు కలగరాదన్నారు. ఆయన వెంట పెదమానాపురం ఎస్ఐ ఆర్. జయంతి ఉన్నారు.

నామమాత్రంగా సమావేశం

భోగాపురం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నామ మాత్రంగా కొనసాగింది. ఎంపీపీ ఉప్పాడ అనూషతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరై నిమిషాల వ్యవధిలో సమావేశాన్ని ముగించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున మండల సర్వసభ్య సమావేశంలో ఎలాంటి చర్చ జరపడంలేదని ప్రకటించారు. సమావేశంలో ఎంపీడీవో గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వంటలు చేయలేం

కొత్తవలస, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి ఒకటో తేది నుంచి 9, 10 తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంటలను చేయమని భోజన నిర్వాహకులు హెచ్చరించారు. గురువారం మధ్యాహ్న భోజన కమిటీ జిల్లా నాయకుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించక పోయనప్పటికీ విద్యార్థులకు వంటలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగిరాక పోతే 9,10, తరగతుల విద్యార్థులకు వంటలు చేయబోమని స్పష్టం చేశారు.

ఘనంగా వ్యాకులమాత యాత్ర

కొత్తవలస, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండడాబా వ్యాకులమాత యాత్ర మహోత్సవా న్ని ఏడోరోజు గురువారం రాత్రి ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన విచారణ కర్తలు పుష్పనాథం, రత్నం, జీవన్, వేలంగణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశుద్ధ బలి పూజ చేశారు. ఫిబ్రవరి 2న జరిగే ఉత్సవంతో నవదిన జప కార్యక్రమాలు పూర్తవుతాయని నిర్వాహకులు తెలిపారు.

వీనులవిందుగా సంగీత విభావరి

విజయనగరం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మఠం వీధిలోని ఉత్తరాది మఠంలో సంగీత విభావరి గురువారం వీనులవిందుగా కొనసాగింది. పురందరదాసుల ఆరాధన పుష్య బహుళ అమావాస్య సందర్భంగా పురస్కరించుకుని కార్యక్రమం జరిగింది. విద్వాంసులు దేవరనామ కీర్తనలతో అలరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.పద్మప్రియ, మంగతాయారు, రవి, సుబ్బారావు, ఈశ్వరమ్మ, డాక్టర్ ఎ.గోపాలరావు, డి.సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

సమాచార హక్కుపై అవగాహన

జామి, జనవరి30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు ఎంపీడీవో నీలం అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో న్యాయవాది బూసర్ల రమణారావు.. సమచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు.

గిరిజన వర్సిటీ పనులు పూర్తి చేయండి

● కలెక్టర్ అంబేడ్కర్

దత్తిరాజేరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గిరిజన యూనివర్సిటీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని మర్రివలస రెవెన్యూ పరిధిలో జరుగుతున్న వర్సిటీ పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఏప్రిల్‌లో ఒక బ్లాకు ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. వర్సిటీ నిర్మాణ ప్రదేశంలో ట్రాన్స్‌కో టవర్స్ ఉన్నాయని, అవి తొలగించాలని కలెక్టర్ దృష్టికి సంబంధిత అధికారులు తీసుకువెళ్లారు. దీనిపై ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ నరసింహరావుతో కలెక్టర్ మాట్లాడారు. వర్సిటీ పనులకు ఎటువంటి ఆటంకాలు కలగరాదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అధికారులతో చర్చించి దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. వర్సిటీ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అనంతరం సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్, పవర్ ప్లాంటులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ టి.శ్రీనివాసరావు, ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ పి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

గాంధీజీకి నివాళి

వాడవాడలా వర్ధంతి సభలు



విజయనగరంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అదితి



ఎస్.కోటలో మహాత్ముడికి నివాళి అర్పిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు



విజయనగరం దాసన్నపేట: గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జనసేన నేత గురాన అయ్యలు



విజయనగరం: ఉడా కాలనీ గాంధీ పార్కులో మహాత్ముడి విగ్రహం ఎదుట నివాళి అర్పిస్తున్న కాలనీవాసులు

నేడు జిల్లాలో విద్యుత్ సరఫరా అంతరాయం

రాజాం రూరల్, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. విజయనగరం టౌన్, రూరల్ డివిజన్లతో పాటు బొబ్బిలి డివిజన్‌లోని పలు ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతు పనుల కోసం ఈనెల 31న విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ గురువారం ఓ షెడ్యూల్ ప్రకటించింది. షెడ్యూల్‌లో ప్రకటించిన వివ రాలిలా ఉన్నాయి. ● విజయనగరం టౌన్ డివిజన్‌లో.. బాబామెట్ట, బ్యాంక్ కాలనీ, ఇందిరానగర్, శ్రీరాంనగర్, ఆర్టీసీ కాంప్లెక్ శివారు ప్రాంతం, కన్జుమర్ కోర్టు ప్రాంతం, ప్రదీప్‌నగర్‌తో పాటు నెల్లిమర్ల మండలం గొర్లెపేట, సీతారామునిపేట, రామతీర్థం.. గుర్ల మండలంలోని గోవుపేట, బూర్లెపేట, పకీరుకిత్తలి, పల్లగండ్రేడు, కొండగండ్రేడు, మునకాలపేట, ముద్దాడపేట, గేదెలపేట గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఈపీడీసిఎల్ ప్రకటించింది. ● విజయనగరం రూరల్ డివిజన్ పరిధి ఎస్.కోట మండలంలో జన్నివలస, వెన్నె, వి.ఆర్.పాలెం, శాసనాపల్లి, భీమసింగి, కొత్తభీమసింగి, తెలగపాలెం, పీతలపాలెం, మర్లపల్లి, లింగంపేట, కిత్తన్నపేట, చందులూరు, ఆర్‌జె.పేట, శ్రీరాంపురం, కొత్తపాలెం, తామరాపల్లి, భూమిరెడ్డిపాలెం, కుద్దువలస, పోతంపేట, చిన గుడిపాల, కె.ఎస్.ఆర్.పురం, నల్లబిల్లి, సిహెచ్.నల్లబిల్లి, చలుమూరివానిపాలెం, బోజంకానిపాలెం.. వంగర మండలంలోని బాగెంపేట, పటువర్ధనం, శ్రీహరిపురం, కింజంగి, దేవకివాడ, రాజాం పరిధిలోని గాంధీనగర్, పాలకొండ రోడ్, బుచ్చెంపేట, అంతకాపల్లి, మొగిలివలస, రామానుజులపేట, గుయ్యానవలస, రేగిడి మండలంలో ఉణుకూరు, ఒప్పంగి, పోరాం.. భోగాపురం మండల పరిధిలోని భోగాపురం, సిమ్మపేట, ఓనంపేట, నారుపేట, అక్కివరం బ్రిడ్జి ప్రాంతం, గొడ్డుపాలేం, వెదుళ్లవలస, చింతపతివాడ, తమ్మయ్యపాలేం, బర్రిపేట, కొనాయప్పాలెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ● బొబ్బిలి డివిజన్‌లో.. సతివాడ, గొలుగువలస, కొరాటం, కొల్లివలస, ఆరికతోట, జగన్నాథపురం, బొబ్బిలి టౌన్, గజపతినగరం పరిధిలోని దత్తిరాజేరు, కోమటిపల్లి, చింతలవలస, పిట్లాడ, ఆంద్ర, లోతుగెడ్డ, జిన్నాం, సూర్యనారాయణ గ్రానైట్స్ (హెచ్.టి.సర్వీస్), రాచకిండాం, కె.అగ్రహారం, గిట్టుపల్లి, రెయింద్రాం ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు వేసే వరకూ ఆందోళన కొనసాగిస్తాం..

వేపాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆతవ రోడ్డు అభివృద్ధి చేయమంటే కల్వర్టులు నిర్మాణం మొదలు పెట్టారు.. అయితే తారు రోడ్డు పనులు ప్రారంభించే వరకు పోరాటం కొనసాగుతోందని ఆతవ రోడ్డు నిర్మాణ పోరాట నాయకులు గురువారం తేల్చి చెప్పారు. ఆతవ జంక్షన్‌లో మూడోరోజు గురువారం వంటావార్పుతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్, ఆతవ దళిత నాయకుడు ఆతవ ఉదయభాస్కర్, కెర్రి దేముడు, చప్ప నాగరాజు, మాజీ సర్పంచ్ బోను నాగరాజు, సర్పంచ్ గొంప వేమనరాము, ఆతవ నాగరాజు, గొంప సన్నిబాబు, తంగేటి సన్నిబాబు, చప్ప నూకరాజు, రాజు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఆతవ గ్రామస్థులు

బాగా చదువుకోండి: ఎమ్మెల్సీ

శృంగవరపుకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బాగా చదవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పశు వైద్యశిబిరాలు నిర్వహించరా?

వంగర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఊరూరా పశు వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించినప్పటికీ కొందరు అధికారులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారని ఎంపీపీ సురేష్, టీడీపీ నాయకుడు ఎల్.కృష్ణమూర్తి విమర్శించారు. గురువారం వారు వేర్వేరుగా విలేకరుల సమావేశంలో మాటాడారు. వంగరలో ఇప్పటి వరకూ పశు వైద్య శిబిరాలను నిర్వహించలేదన్నారు. ఈ విషయం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

రాష్ట్రం దివాలా ఘనత వైసీపీదే: ఎమ్మెల్యే

విజయనగరం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అవలంబించిన విధానాలే రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీయడానికి కారణమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం వ్యయం చేయాల్సిన ధనాన్ని స్వప్రయోజనాల కోసం సీఎం జగన్ వినియోగించారని ఆరోపించారు. అన్నింటిలోనూ కమిషన్లతో జగన్ ఆర్థికంగా బలోపేతమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడు నెలల కాలంలో ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీలకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ప్రభుత్వం ఎంతో పాటు పడుతోందన్నారు.

జామి పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

జామి, జనవరి30 (ఆంధ్రజ్యోతి): జామిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌వో జీవన్‌కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడటంతో పాటు రికార్డులను పరిశీలలించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

అంగన్‌వాడీల పోస్ట్ కార్డు ఉద్యమం

శృంగవరపుకోట జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సమ్మె ఒప్పందాల అమలుకు శృంగవరపుకోట ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ వర్క ర్స్, హెల్పర్స్ పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. గురువారం రాష్ట్రపతికి పోస్టు కార్డులు పంపించారు. కార్యక్రమంలో డి.శ్యామల, లక్ష్మి, నాగజ్యోతి తదితరులున్నారు.

●వంగర: అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. గురువారం అరసాడ సెక్టార్ పరిధిలో యూనియన్ లీడర్లు భారతి, రూప ఆధ్వర్యంలో కార్యకర్తలు అందోళన చేశారు. హక్కుల సాధనతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీల సాధనకు వచ్చేనెల 13న రాష్ట్రపతి భవన్ ఎదుట అందోళన చేపడతామన్నారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

●వేపాడ: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రపతికి లేఖలు పంపుతున్నట్టు సీఐటీయూ జిల్లా నాయకుడు చల్లా జగన్ తెలిపారు. గురువారం బొద్దాం అంగన్‌వాడీ కేంద్రం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

●భోగాపురం: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ గురువారం భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు కొర్లమ్మ, అనిత, అంగన్‌వాడీ వర్కర్స్ వి. లక్ష్మి, జి.తోటయ్యమ్మ, కె.పార్వతీదేవి, వెంకటి, ఆర్‌పద్మ, జి.శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలను చెల్లించండి

గజపతినగరం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్లకు వేతన బకాయిలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కల్యాణికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని బంగారమ్మపేట పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్లకు 10 నెలలు, లింగాలవలసలో 9 నెలల వేతన బకాయిలు ఉన్నాయన్నారు. వాటిని తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.రాము, బి.అప్పలస్వామి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాసుపత్రి వద్ద క్యాంటీన్‌కు వినతి

విజయనగరం దాసన్నపేట, జనవరి 30 ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాసుపత్రి ఆవరణలో అన్నా క్యాంటీన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పౌరవేదిక జిల్లా అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ కోరారు. గురువారం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రాసుపత్రిలో ఇరుకు గదుల్లో రోగులు, డాక్టర్లు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

క్రైం న్యూస్

భోగాపురం, జనవరి30(ఆంధ్రజ్యోతి): నారుపేట సమీపం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డెంకాడ మండలం మోదవలస గ్రామానికి చెందిన బోని అప్పలనాయుడు(50) మృతి చెందారు. అప్పలరాజు భోగాపురం నుంచి రాజాపులోవ కారులో వెళ్తున్నాడు. అయితే నారుపేట సమీపంలో ఎదురుగా వస్తున్న జేసీబీని కారు ఢీకొంది. దాంతో అప్పలనాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం తగరపువలసలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

చెరువులో యువకుడి మృతదేహం

భోగాపురం, జనవరి30(ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి అనుకుని ఉన్న గంగిరావి చెరువులో గురువారం తేలిన మృతదేహం భోగాపురానికి చెందిన యువకుడు పసుపులేటి వెంకటేష్(24)గా గుర్తించామని ఎస్ఐ వి.పాపారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భోగాపురానికి చెందిన పసుపులేటి సూరిబాబుకు ఇద్దరు కుమారులు. ఇటీవల పెద్దకుమారుడు హైదరాబాద్ వెళ్లి పోయాడు. చిన్న కుమారుడు పసుపులేటి వెంకటేష్ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ వ్యవసాయం, కూలి పనులు చేస్తుండేవాడు. అయితే ఈనెల 23న మధ్యాహ్నం బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు మణిమ్మ, సూరిబాబు గ్రామంలో స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికారు. అయితే గురువారం ఉదయం గంగిరావి చెరువులో మృతదేహం తేలి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం గుర్తుపట్టలేని రీతిలో ఉంది. ఎట్టకేలకు తల్లిదండ్రులు మృతదేహాన్ని గుర్తించి బోరుమన్నారు. మృతుడు తండ్రి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పాపారావు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో ఒకరి మృతి

గజపతినగరం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఒకరు అనా రోగ్యంతో మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. రైల్వే హెచ్‌సీ వి.ఈ శ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెంటాడ మండలం జయితి గ్రామా నికి చెందిన చప్పాన రామారావు(49) రాయిగడలో ఒక హోటల్‌లో పనిచేస్తున్నారు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చేందుకు రాయిగడ నుంచి బయలుదేరి గజపతి నగరం చేరుకున్నారు. గురువారం తెల్లవారు జామున విధి నిర్వహణలో ఉన్న ట్రాక్‌మేన్‌లు మృతదేహన్ని గుర్తించి స్టేషన్ మాస్టర్ కిశోర్‌కుమార్‌కు సమాచారాన్ని అందించారన్నారు. మృతుడి జేబులోని సెల్‌ఫోన్ ద్వారా మెంటాడ మండలం జయితి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చోరీపై పోలీసులకు ఫిర్యాదు

భోగాపురం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): భోగాపురం పెద్దవీధిలోని కింజరాపు విజయలక్ష్మి ఇంట్లో చోరీ జరిగినట్టు బాధితురాలు ఫిర్యాదు చేసిందని ఎస్ఐ వి.పాపారావు గురువారం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయలక్ష్మి ఈనెల 21వ తేదీన శ్రీకాకుళం జిల్లా కోమరిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు 22న ఇంటికి తిరిగి వచ్చింది. అయితే తలుపులు ఆమె వేసినట్లేగానే ఉన్నాయి. ఇటీవల నగదు అవసర కావడంతో ఇంట్లోని సూట్‌కేసు పెట్టే చోటుకు వెళ్లింది. అక్కడ సూట్‌కేసు కనిపించలేదు. రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు ఉన్న సూట్‌కేసు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

సారాతో ఇద్దరి అరెస్టు

మెంటాడ, జనవరి 30 ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరాం, రెడ్డివానివలస గ్రామ శివారులో గజపతినగరం ఎక్సైజ్ పోలీసులు సారాతో ఇద్దరిని గురువారం అ రెస్టు చేశారు. వారి నుంచి నాలుగు లీటర్ల సారా స్వాధీన చేసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ జె.జనార్దనరావు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు కొండలరావు, పి.న రేంద్రకుమార్, హెచ్‌సీ బాషా, కానిస్టేబుళ్లు వి.అప్పారావు, ఎ.అప్పారావు పాల్గొన్నారన్నారు.

మహిళ అదృశ్యం

శృంగవరపుకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలో మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ గంగరాజు తెలిపారు. ఇందుకు సంబం ధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన జి.లక్ష్మి అప్పలకొండ (50) డిసెంబరు 15న శృంగవరపుకోట సాయినాథ్ కాలనీలోని అక్క యాగాటి లక్ష్మి ఇంటికి వచ్చింది. తిరిగి ఈనెల 26న కాకినాడ వెళ్లేందుకు ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆమె కనిపించకపోవడంతో అక్క లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ధాన్యం కొనుగోలు చేయండి

వంగర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు చేయాలని కొప్పరవలస రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గ్రామ సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. స్థానిక రైతుల నుంచి కొద్దిపాటి ధాన్యం కొనుగోలు చేసి టార్గెట్ పూర్తయిందని కొనుగోలు నిలిపివేయడంతో మండిపడ్డారు. గ్రామంలో 673 ఎకరాల్లో వరి సాగు చేయగా 1617 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. ఇప్పటి వరకు 1130 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశారన్నారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుంటే కార్యాలయం ముందు వంటావార్పు చేస్తామని రైతులు హెచ్చరించారు.

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

శృంగవరపుకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి టి.వి.రాజేశ్‌కుమార్ సూచించారు. గురువారం శృంగవరపుకోట ఉప కారాగారాన్ని ఆయన సందర్శించారు. కారాగారంలో సదుపాయాలపై ఆరా తీశారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలు ఉచితంగా ప్రభుత్వం తరఫున న్యాయవాదులను నియమించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉప కారాగార న్యాయవాది టి.వి.రమణమూర్తి తదితరులు ఉన్నారు.

పశు సంరక్షణపై శ్రద్ధ వహించండి

రేగిడి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పశుసంరక్షణ, పశువృద్ధిపై రైతులు, వెటర్నరీ సిబ్బంది శ్రద్ధ వహించాలని పశు వైద్య శిబిరాల ప్రత్యేకాధికారి, జాయింట్ డైరెక్టర్ ఆర్.చిన్నయ్య, మరో జేడీ వై.వి.రమణ అన్నారు. చిన్నశిర్లాంలో గురువారం నిర్వహించిన పశు వైద్యశిబిరాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య శిబిరం నిర్వహణ, మందుల పంపిణీ, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. ఫిబ్రవరిలో నిర్వహించనున్న పాల పోటీల్లో రైతులు పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. రాజాం ఏడీ జయప్రకాశ్, రేగిడి పశు వైద్యాధికారి దుర్గాప్రసాద్, రేగిడి, ఉణుకూరు వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

కళా కుటుంబానికి పరామర్శ

రేగిడి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు సోదరుడు కిమిడి సత్యనారాయణ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని పలువురు పరామర్శిస్తున్నారు. గురువారం పాలకొండ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో పాటు పాలకొండ, రేగిడి, సంతకవిటి, రాజాం, వంగర, చీపురపల్లి, జిసిగడాం మండలాలకు చెందిన ముఖ్య నేతలు, పార్టీ క్యాడర్.. కళాతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంచి ఆధ్యాత్మకవేత్త, పారిశ్రామికవేత్తను కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు.



కళాను పరామర్శిస్తున్న పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక

గంజాయి నిల్వల పరిశీలన

లక్కవరపుకోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ సందర్భాల్లో పట్టుబడి స్టేషన్‌లో నిల్వలు ఉన్న గంజాయి తగలబెట్టేందుకు అన్ని స్టేషన్లును పరిశీలిస్తున్నట్టు అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో గంజాయి నిల్వలను పరిశీలించారు. ఎల్.కోట స్టేషన్‌లో 189 కిలోల గంజాయి ఉన్నట్టు నిర్ధారించారు. వేపాడ స్టేషన్‌లో 3.6 కిలోలు, జామి స్టేషన్‌లో 1.76 కిలోలు గంజాయి ఉందన్నారు. జిల్లా అంతటా స్టేషన్లు పరిశీలించిన అనంతరం దాన్ని తగలబెడతామన్నారు. ఆయనతో పాటు డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐ ఎల్.అప్పలనాయుడు ఉన్నారు.



గంజాయిని పరిశీలిస్తున్న ఏఎస్పీ

గిరిజనుల కష్టాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

నిర్మాణం పూర్తయితే 15 గిరిజన గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పనున్నాయి. ముఖ్యంగా సరాయివలసలోని గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఈ వంతెనలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

చాలా సంతోషంగా ఉంది..



కొండవాగు గెడ్డపై రెండు వంతెనల నిర్మాణానికి మంత్రి సంధ్యారాణి శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా సరాయి వలస సమీపంలో వంతెన లేక ఎందరో ప్రమాదాలకు గురయ్యారు. బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే గిరిజనులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

- జి.యుగంధర్, సర్పంచ్, పాంచాళి, పాచిపెంట మండలం

సకాలంలో పనులు పూర్తిచేస్తాం

వంతెనల నిర్మాణం సకాలంలో పూర్తిచేస్తాం. పనులు శరవేగంగా చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించాం. దశాబ్దాల నాటి గిరిజనుల కల నెరవేరనుంది. డోలీ మోతలు తగ్గుతాయి.

- గుమ్మిడి సంధ్యారాణి, స్త్రీ శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి

ఎట్టకేలకు..

(5వ పేజీ తరువాయి)

పుష్ప శ్రీవాణి ఏకలవ్య పాఠశాల భవనం పనులకు శంకుస్థాపన చేశారు. అయితే, వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నత్తనడకన సాగాయి. పనులు పూర్తి కాకుండానే ఎన్నికల ముందు అప్పటి డిప్యూటీ సీఎం, గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పాఠశాల భవనాన్ని హడావుడిగా ప్రారంభించేశారు. పనులు అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులకు ఎస్.బెలగాంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీనిపై దృష్టిసారించింది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఒత్తిడితో భవన నిర్మాణం పూర్తయ్యింది. కాగా, అదనపు భవనాలకు మరో రూ.4కోట్లు మంజూరయ్యాయి. అయితే, కాంట్రాక్టర్ పిల్లర్లు వేసి మిగతా పనులు చేయలేనని చేతులు ఎత్తేశాడు.

ప్రిన్సిపాల్‌కు అప్పగిస్తాం..

ఏకలవ్య పాఠశాల భవనం సిద్ధమైంది. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాం. రూ.12 కోట్లతో స్కూల్ భవనం, బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహం, డైనింగ్ హాల్, ప్రిన్సిపాల్, సిబ్బంది క్వార్టర్స్‌లు పూర్తి చేశాం. విద్యుత్ సదుపాయం కూడా కల్పించాం. ప్రస్తుతం కాలువ పనులు చేస్తున్నాం. ఫిబ్రవరి 1వ తేదీన ప్రిన్సిపాల్‌కు భవనాన్ని అప్పగిస్తాం. రూ.4కోట్లతో అదనపు భవనాల నిర్మాణం ప్రారంభించినప్పటికీ కాంట్రాక్టరు పనులు చేయకుండా నిలుపుదల చేశాడు. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. ఇంకా ప్రహరీ నిర్మాణానికి రూ.70లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు వచ్చిన వెంటనే ఈ పనులు చేస్తాం.

- చాణిక్య, డీఈఈ, గిరిజన ఇంజనీరింగ్ శాఖ, భద్రగిరి

ప్రహరీ నిర్మించాలి

ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణం పూర్తయ్యింది. ఇంకా కిటికీలకు సేఫ్టీ గ్రిల్స్ అమర్చాల్సి ఉంది. అలాగే, రక్షణ గోడను నిర్మించాల్సి ఉంది. ఈ పనులు త్వరగా పూర్తి చేయాలి.

- యోగేందర్ బహదూర్, ప్రిన్సిపాల్, ఏకలవ్య పాఠశాల, కురుపాం

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.రాజపురంలో ఉపాధి హామీ పథకం నిధులు నుంచి రూ.50లక్షల అంచనాతో మంజూరైన శ్మశాన వాటికలు, కాంపౌండ్‌వాల్, అప్రోచ్‌రోడ్డు పనులను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గురువారం పరిశీలించారు. గ్రామాల్లోని అభివృద్ధి పనులను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగారావు, గొర్లె గౌరునాయుడు, భాస్కరరావు, వాన జగన్నాథం పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి



అధికారులకు ఆదేశిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

సాలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు త్వరిత గతిన పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిం చాలని కోరారు. పిటీషనర్‌కు తగు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో మూడు మండలాల తహసీల్దార్‌లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఫీడర్‌పైన మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని సింగన్నవలస, పరశురాంపురం, వెలగవాడ, విజయరాంపురం, రాజుపేట, సిరికొండ, లుంబూరు, ఓని, గుడివాడ, కొత్తపూరు గ్రామాలకు అంతరాయం ఉంటుందన్నారు.

● భామిని: భామిని సబ్‌స్టేషన్ పరిధిలోని బత్తిలి ఫీడర్‌లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈటీ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పసుకుడి, బురుజోల, మంద్రుంగూడ గ్రామాలకు సరఫరా ఉండదని ఆయన చెప్పారు.

6 నుంచి పీసా శిక్షణ తరగతులు

గుమ్మలక్ష్మీపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వచ్చే నెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పీసా శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సాల్మన్‌రాజు తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రోజుకు 150 మంది సభ్యులకు శిక్షణ తరగతులు ఇస్తామన్నారు. పీసా శిక్షణా తరగతులకు సర్పంచ్‌లు, పీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, బీఎల్వోలు, వీఆర్వోలు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటారని చెప్పారు.

ప్రమాదకర ప్రయాణాలొద్దు

సాలూరు రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఘాట్ రోడ్డులో ప్రమాదకరమైన ప్రయాణాలు చేయొద్దని సాలూరు ఎంవీఐ జేవీఎస్ ఎస్ఎస్ ప్రసాద్ కొఠియా గిరిజనులకు సూచించారు. సాలూరు మండలం పూతికవలస వద్ద కొఠియా గ్రూపు కోనదారకు వెళ్లే మార్గంలో గురువారం ఆయన రహదారి భద్రత మాసోత్సవాన్ని నిర్వహించారు. అక్కడ అధిక లోడ్‌తో జీపులు వస్తుండడాన్ని ఆయన గమనించారు. ఇలా తీసుకొస్తే జీపు యాజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ కాశీరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మక్కువలో బస్సులు కోసం నిరీక్షిస్తున్న భక్తులు

నిరీక్షించి.. నీరసించి

● బస్సులు లేక శంబర భక్తుల అవస్థలు

మక్కువ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ జాతర నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అవస్థలు తప్పలేదు. జాతర ముగిసిన సందర్భంగా గురువారం భక్తులు తిరిగి స్వగ్రామాలకు బయలుదేరారు. మండల కేంద్రానికి చేరుకున్నారు. అయితే అక్కడ తగినన్ని బస్సులు లేకపోవడంతో వారు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కొంతమంది వృద్ధులు నిరీక్షించలేక నీరసించిపోయారు. ● పార్వతీపురం, సాలూరు డిపోల మేనేజర్లను వివరణ కోరగా జాతర సమయంలో మాత్రమే అధిక శాతం బస్సులు వేశామని చెప్పారు. శనివారం నుంచి భక్తుల రద్దీ మేరకు బస్సుల సంఖ్య పెంచుతామని తెలిపారు.

పార్వతీపురం ఎమ్మెల్యేకి ఘన స్వాగతం



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం/ సీతానగరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దావోస్‌లో ఇటీవల జరిగిన సమావేశాల్లో పార్వతీపురం పేరును ప్రస్తావించే అవకాశం రావడం ఎంతో గర్వంగా ఉందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. దావోస్ పర్యటన ముగించుకుని పార్వతీపురం నియోజకవర్గానికి చేరుకున్న ఆయనకు ఘన స్వాగతం లభించింది. కూటమి నాయకులు సీతానగరం నుంచి పార్వతీపురం పట్టణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ చేసిన కృషి మరువలేనిదన్నారు.

ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న జైళ్ల శాఖాధికారి మోహన్‌రావు

పాలకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలకు నెలలో రెండు సార్లు వైద్య పరీక్షలు చేయించాలని జిల్లా జైళ్ల శాఖాధికారి కె.మోహన్‌రావు అన్నారు. పాలకొండ సబ్‌జైలును ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. వారిపై నమోదు చేసిన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెయిల్ కోసం న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా.. అని ఆరా తీశారు. అనంతరం జైలు పరిసరాలు, కిచెన్ రూమ్, స్టోర్‌రూమ్‌లను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. హెడ్ వార్డర్ పి.చంద్రరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, నాగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు ఏమయ్యాయి?

జియ్యమ్మవలస, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి గారూ.. ఇంకా ఎంత కాలం ప్రజలను మోసం చేస్తారు అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబును మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి ప్రశ్నించారు. గురువారం ఆమె చినమేరంగి గ్రామంలో తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. 'జగన్మోహన్‌రెడ్డి అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేశారని, నేను అధికారంలోకి వచ్చిన తర్వాత సంపద సృష్టిస్తానని చేసిన హామీలు ఏమయ్యాయి' అని ముఖ్యమంత్రిని ఉద్దేశించి అన్నారు. సూపర్ సిక్స్‌తో పాటు ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా అమలు చేయాలని, లేదంటే ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని ఆమె హెచ్చరించారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించిందని చెప్పడం సరికాదని పుష్పశ్రీవాణి అన్నారు. 'అసెంబ్లీకి వెళ్లి అక్కడ మీ మంత్రులు, అధికారులు ఇచ్చిన పత్రాలను చూసి మాట్లాడాల'ని ఆమె హితవు పలికారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

పాలకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో సనారీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు టీడీపీ విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకుడు పల్లా కొండలరావుకు గురువారం ఆహ్వానం అందించారు. పాలకొండలో దశాబ్దకాలం నుంచి మహాశివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న అన్న సమారాధానికి పాలకొండ ప్రజలందరూ వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు కోరారు.

చెరువుల్లో చేప పిల్లలు విడుదల

మక్కువ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ గిరిజన ఉప ప్రణాళిక పథకంలో భాగంగా మక్కువ మత్స్యకార సంఘం పరిధిలో ఉన్న మండలంలోని కవిరిపల్లిలో ఐదు చెరువుల్లో 14,910, సరాయివలసలోని ఐదు చెరువుల్లో 10,430, కొండ రేజేరులోని ఐదు చెరువులో 18,420, తూరు మామిడిలోని ఏడు చెరువుల్లో 16,310, గిరిజన మత్స్యకార సంఘ పరిధిలోని కొయ్యానపేటలో 14 చెరువుల్లో 27,510, వెంకట భైరిపురంలోని ఐదు చెరువుల్లో 14,830 మొత్తం కలిపి ఒక లక్షా 2 వేల 410 చేపపిల్లలను గురువారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మండల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వై.శ్రీదేవి మాట్లాడుతూ మత్స్యకారులు చేప పిల్లలను సక్రమంగా పోషించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సహాయకుడు ఎస్.గౌరీశ్వరరావు, మండల మత్స్యకార సంఘ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, జి.సింహాచలం పాల్గొన్నారు.

కొండపై తవ్వకాలు సరికాదు

● అనుమతులు రద్దు చేయాలంటూ గిరిజనుల ధర్నా



ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

పార్వతీపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరి రెవెన్యూ పరిధిలో బడిదేవరమ్మ కొండ మైనింగ్ తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అన్ని రకాల అనుమతులను రద్దు చేయాలని కొండ పరిసర ప్రాంత గిరిజనులు, కొండ పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపై గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చారని, అక్కడ మైనింగ్ తవ్వకాలకు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. అక్కడ గిరిజనులు బడిదేవరమ్మను దేవతగా కొలుస్తారని అన్నారు. అడ్డగోలు తవ్వకాలకు అనుమతులు ఇచ్చి గిరిజన బతుకులు నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబో మని హెచ్చరించారు. ధర్నాకు వచ్చిన ఐటీడీఏ ఏపీవో మురళీధర్, ఏవో ప్రసాద్‌లకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మూడడ్ల కృష్ణమూర్తి, బొత్స నరసింహమూర్తి, పి.శ్రీనునాయుడు, ఊయక ముత్యాలు, ఎం.భాస్కరరావు, పాలక రంజిత్‌కుమార్, బుడితి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై సకాలంలో స్పందించాలి



గర్భిణీ కార్డును పరిశీలిస్తున్న జగన్మోహనరావు

కొమరాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది ఆరోగ్య సమస్యలపై సకాలంలో స్పందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. చంద్రంపేట గ్రామాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఆరోగ్య సర్వేలు చేపడుతున్న తీరుపై ఆరా తీశారు. ప్రస్తుతం కొనసాగుతున్న లెప్రసీ, ఎన్సీడీ, స్కూల్ హెల్త్, అంగన్‌వాడీ సర్వే, స్ర్కీనింగ్ ఏ మేరకు పూర్తి చేశారో ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కిల్కారీ మొబైల్ సేవలపై అడిగి తెలుసుకున్నారు. పిల్లల టీకా తేదీలను కార్డులో తనిఖీ చేసి వైద్య సిబ్బంది సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు వేయిస్తున్నారా అని అడిగారు. ఈ కార్యక్రమంలో ఎపెడిమిక్ ఈవో సత్తిబాబు, సూపర్‌వైజర్ నిర్మల, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్వింటా పత్తికి రూ.600 ఆదా

భామిని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సీసీఐఎల్ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, గంటూరు) సంస్థ మండల కేంద్రంలో పత్తిని కొనుగోలుతో పలువురు రైతులకు క్వింటాకు రూ.600 ఆదా అయ్యింది. అయితే ఆలస్యంగా పత్తి కొనుగోలు ప్రారంభించడంతో పలువురు రైతులు క్వింటాకు రూ.600 నష్టానికే విక్రయించారు. ముందుగానే పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఉంటే అధిక శాతం రైతులు కొనుగోలు కేంద్రంలోనే విక్రయించేవారు. నిబంధనల మేరకు 8 తేమ శాతం ఉన్న పత్తి రూ.7,521కు క్వింటా కొనుగోలు చేయగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు సుమారు రూ.300 క్వింటాకు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. అయితే ఈ క్రాప్ నమోదు నిబంధనలు కొంత వెసులుబాటు కల్పించి ఉంటే రైతు పండించిన పంట కేంద్రానికే అందే అవకాశం ఉండేది. ఏది ఏమైనా స్థానిక రైతులకు రూ.700 వరకు క్వింటాకు ఆదా కాగా, ఇతర ప్రాంతాల రైతులకు రవాణా ఖర్చు అధికం కావడంతో రూ.600 వరకు లాభం వచ్చిందని అంటున్నారు. ఇప్పటివరకు 1075 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్టు పత్తి కొనుగోలు అధికారి అతులు తెలిపారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

గరుగుబిల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ పీడీ డా.టి.కనకదుర్గ అన్నారు. మండలంలోని పెదగుడబ, ఉల్లిభద్ర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె గురువారం సందర్శించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ఎత్తు, బరువులను సరిచూశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. పెదగుడబ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

8న తోటపల్లిలో సామూహిక వివాహాలు

గరుగుబిల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల్లో వచ్చే నెల 8వ తేదీన సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి సేవా ట్రస్టు ప్రధాన కార్యదర్శి డా.డి.పారినాయుడు తెలిపారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు విగ్రహ పునఃప్రతిష్టోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా 8వ తేదీన సమూహిక వివాహాలు నిర్వహిస్తారని చెప్పారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి

● డీఎల్పీవో కొండలరావు

సీతంపేట రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీతంపేట భామిని మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలల నిర్వహణపై దృష్టి సారించాలని అన్నారు. పీఆర్వో మ్యాప్, హౌస్ టాక్స్ కలెక్షన్స్‌పై దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్వతీపురం డీఎల్‌పీవో ఎం.నాగభూషణరావు, ఎంపీడీవో కె.గీతాంజలి, కె.మురళీధర్, ఈవోపీఆర్డీ కె.సత్యం పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

సీతంపేట రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వైటీసీ కేంద్రంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో మండల సమావేశా న్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో కె.గీతాంజలి ప్రకటించారు. అయితే ఈ సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు.. అధికారుల తీరుపై మండిపడ్డారు. ఎన్నికల కోడ్ ఉందని తెలిసి తమను ఎందుకు సమావేశానికి ఆహ్వానించారని సభ్యులు మండపడ్డారు. తమపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, యథేచ్ఛగా ప్రోటోకాల్ ఉల్లంఘణకు పాల్పడుతున్నారని వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, సర్పంచ్ తిరుపతిరావు.. ఎంపీడీవోకు తెలిపారు. ఎన్నికల కోడ్ వల్ల సమావేశం వాయిదా వేశామని, తిరిగి ఎప్పుడు నిర్వహించేది సభ్యులకు తెలియజేస్తామని ఎంపీపీ బి.ఆదినారాయణ తెలిపారు. జడ్పీటీసీ సవర లక్ష్మి, ఏవో శ్రీదేవి, వైద్యాధికారి భానుప్ర తాప్, ఏవో శ్రీదేవి, ట్రాన్స్‌కో ఏఈ నీలిమ, హౌసింగ్ ఏఈ వెంకటేష్ హాజరయ్యారు.

కౌన్సిల్ సమావేశం..

పాలకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31న జరగాల్సిన నగర పంచాయతీ సాధారణ కౌన్సిల్ సమావేశం రద్దు చేసినట్టు పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన ప్రాప్తికి కోడ్ ఉన్నందున ఈ సమావేశాన్ని రద్దు చేశామని చెప్పారు. వార్డు సభ్యులు, కౌన్సిలర్లు గమనించాలని ఆయన కోరారు.

స్పీకర్ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం



రాస్తారోకో నిర్వహిస్తున్న ఆదివాసీలు

బెలగాం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ అభివృద్ధి జరగాలంటే 1/70 చట్టం సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం బెలగాంలోని కూడలి వద్ద రాస్తారోకో చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాము మాట్లాడుతూ ఆదివాసీ భూములకు రక్షణ కల్పించే చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. సీపీఎం నాయకులు కృష్ణమూర్తి, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఒడిశా పోలీసుల వైఖరిపై నివేదిక

సాలూరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఒడిశా పోలీసుల వైఖరిపై సాలూరు సీడీపీవో విజయలక్ష్మి గురువారం పార్వతీపురం జిల్లా ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 27న కొఠియా గ్రూపు గ్రామం దిగువశెంబి అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన నేమ్‌బోర్డు, టీఎల్‌ఎంలను కొఠియాకి చెందిన ఒడిశా పోలీసులు దౌర్జన్యంగా తీసుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సీడీపీవో బి.విజయలక్ష్మి, సూపర్ వైజర్ లక్ష్మి.. గురువారం దిగువశెంబి గ్రామానికి వెళ్లి, వివరాలు సేకరించారు. తమ పరిశీలనలో తెలుసుకున్న వివరాలపై ఐసీడీఎస్ పీడీకి నివేదిక అందజేశారు.

న్యూస్ బాక్స్

ఏఎస్పీగా నాగేశ్వరి



బెలగాం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు ఎస్పీగా ఎల్.నాగేశ్వరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అమరావతి నుంచి బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఏఎస్పీగా పని చేసిన ఓ.దిలీప్‌కిరణ్ విజయవాడ ఏసీబీకి బదిలీపై వెళ్లనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన నుంచి నేటి వరకు ఏఎస్పీగా దిలీప్‌కిరణ్ పని చేశారు.

108 సిబ్బందికి శిక్షణ

పాలకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో 108 అంబులెన్స్‌లో పనిచేసే మెడికల్ టెక్నీషియన్లకు గురువారం రిఫ్రెషర్ శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా మేనేజర్ ఎస్.మన్మథనాయుడు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అపస్మారక, గుండె ఆగిపోయే స్థితిలో ఉన్నవారికి సీపీఆర్ విధానంపై ట్రైనర్ ఓజేటీ ఆలుబిల్లి శ్రీనివాసరావు అవగాహన కల్పించారు.

సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఆదేశాలు

పార్వతీపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన హనుమంతు శంకరరావుపై సస్పెన్షన్ ఎత్తివేశారు. ఈయన 2023 ఆగస్టు 9న ఓ గుత్తేదారు నుంచి రూ.లక్షా 50వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఈ మేరకు పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది.

అరకు ఉత్సవాలకు కురాసింగి బృందం

గుమ్మలక్ష్మీపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అరకు ఉత్సవాలకు గుమ్మలక్ష్మీపురం మండలం కురాసింగి గ్రామానికి చెందిన గిరిజన సాంస్కృతిక బృందం గురువారం బయలుదేరి వెళ్లింది. వీరు గిరిజన ఉపాధ్యాయుడు నాగభూషణం ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు. వీరు మూడు రోజుల పాటు అరకులో ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

హోర్డింగ్‌లు తొలగించండి

పాలకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉందని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలోని రాజకీయ పార్టీలకు చెందిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు పెట్టరాదని సూచించారు. ప్రస్తుతం ఉన్న హోర్డింగ్‌లను తొలగించాలన్నారు.

వారపు సంతలో డ్రోన్ బీట్

కురుపాం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): కురుపాం వారపు సంతలో గురువారం స్థానిక పోలీసులు డ్రోన్ బీట్ కార్యక్రమం చేపట్టారు. కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు సంతలో డ్రోన్ కెమెరాను విడిచిపెట్టి పరిశీలించారు. ఎక్కడైనా నేరాలు జరిగితే డ్రోన్ ద్వారా సులువుగా తెలుసుకోవచ్చునని ఆయన తెలిపారు.

నేడు మనుమకొండలో ఉపకరణాల గుర్తింపు

భామిని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మనుమకొండ గ్రామంలో శుక్రవారం దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాల గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సత్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురానికి చెందిన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహి స్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అవయవాలు తయారీ కేంద్రం ఉచితంగా పరికరాలు అందిస్తుందని చెప్పారు. దివ్యాంగులు తప్పని సరిగా 40 శాతం వైద్య ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, అంగవైకల్య కనిపించే పాస్‌పోటోతో హాజరు కావాలని ఆయన కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

గరుగుబిల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ విజయస్వరూప్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక స్టేట్ బ్యాంకు, ఏపీజీవీబీ ఆధ్వర్యంలో వెలుగు సహకారంతో గురువారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. స్టేట్ బ్యాంకు మేనేజర్ హేమంత్‌కుమార్, ఏపీజీవీబీ మేనేజర్ దీక్షిత, వెలుగు ఏపీఎం పెదిరెడ్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.